క్లుప్తంగా

బాలుడి అదృశ్యం

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన పన్నాల దీపక్ అనే 9వతరగతి విద్యార్థి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు. అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో విద్యార్థి తండ్రి పన్నాల ముని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని హనుమాన్‌వాడలో గురువారం 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు. హనుమాన్‌వాడకు చెందిన రాజేశ్‌తోపాటు రాజ్‌కుమార్ అనే ఇద్దరు వ్యక్తులు తమ ఇళ్లలో 17 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిలువ చేశారు. రేషన్ బియ్యాన్ని పట్టుకొని పౌర సరఫరాల శాఖ అధికారులకు అప్పగించడంతోపాటు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మపురి: ధర్మపురిలోని గిరుకలకాలనీకి చెందిన గుర్రాల సుధాకర్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. సుధాకర్ ఇంట్లో 14 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ మోసంపై కేసు

కథలాపూర్(వేములవాడ): కథలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి క్రెడిట్ కార్డు బ్లాక్ కోసం ఓటీపీ చెప్పాలని కోరగా.. స్పందించి చెప్పడంతో రూ.99,670 బ్యాంక్ ఖాతా నుంచి మాయమైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ గురువారం తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి యాప్ ఇన్‌స్టాల్ చేసుకొమ్మని చెప్పగా.. స్పందించిన బాధితుడు యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని ఓటీపీని గుర్తుతెలియని వ్యక్తికి చెప్పారు. మూడుసార్లు ఓటీపీ చెప్పగా.. తన ఖాతా నుంచి రూ.99,670 పోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇబ్రహీంపట్నం: కొమటికొండాపూర్ గ్రామంలో అబ్బిడి శ్రీనివాస్ అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ అనిల్ గురువారం తెలిపారు. గ్రామ శివారులోని గోదావరి నుంచి ఇబ్రహీంపట్నంకు తరలిస్తుండగా పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

13న తైబజార్‌కు బహిరంగ వేలం

మెట్‌పల్లి: 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తైబజార్‌కు ఈనెల 13న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మోహన్ గురువారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ఈనెల 12 లోపు రూ.2వేల దరఖాస్తు రుసుము మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలని సూచించారు.

మీసేవ కేంద్రాలకు 35 దరఖాస్తులు

ఇబ్రహీంపట్నం: వేములకుర్తి, ఎర్దండిలో కొత్తగా మీసేవ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు గాను 35 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ ప్రసాద్ గురువారం తెలిపారు. కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ యాస్మిన్ భాషా నోటిఫికేషన్ ఇవ్వగా.. గురువారం చివరి రోజు కావడంతో వేములకుర్తి మీసేవ కేంద్రానికి 24, ఎర్దండి కేంద్రానికి 11 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు.

ఉచిత కోర్సుకు ప్రవేశ పరీక్ష

జగిత్యాల: ఐదు నెలల ఫౌండేషన్ ఉచిత కోర్సు శిక్షణకు ప్రవేశ పరీక్ష ఈనెల 10న నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జిల్లాకేంద్రంలో 2023–24 సంవత్సరానికి గాను రెండో బ్యాచ్ ఫౌండేషన్ కోర్సు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి ఒంటి గంట వరకు ఆఫ్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితా

జగిత్యాల: ఒప్పంద పోస్టుల కోసం దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థుల ప్రాథమిక జాబితా జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చామని జిల్లా కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారికి సంబంధించిన వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టామని, అభ్యంతరాలుంటే ఈనెల 7 నుంచి 12 వరకు వైద్య ఆరోగ్య శాఖలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పేట భాస్కర్‌కు డాక్టరేట్



కోరుట్ల: పట్టణానికి చెందిన పేట భాస్కర్‌కు డాక్టరేట్ అవార్డు దక్కింది. 30ఏళ్లుగా వివిధ ఉద్యమాలు, సామాజిక సేవలు చేస్తున్న పేట భాస్కర్‌ను గుర్తించిన సోషల్ సర్వీస్ కేటగిరిలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. యునివర్సిటీ కోఆర్డినేటర్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్జీవో చైర్మన్ లయన్ ఆకుల రమేశ్ ఆధ్వర్యంలో ఈనెల 24న హైదరాబాద్‌లోని సిటీ కల్చర్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో డాక్టరేట్ అందించనున్నట్లు పేట భాస్కర్ తెలిపారు.

ఘనంగా మహిళా దినోత్సవం

ధర్మపురి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో పని చేస్తున్న మహిళలను గురువారం సన్మానించారు. ఆరెపెల్లి ప్రభుత్వ పాఠశాలలో మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు నితిక్‌కుమార్ మాట్లాడారు. బోధన, బోధనేతర సిబ్బందిని సన్మానించారు. ఉపాధ్యాయులు మ్యాన పవన్‌కుమార్, సరోజ, చామంతి తదితరులున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అన్నారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు, మండల రిసోర్స్ పర్సన్లు తదితరులున్నారు.

మహిళలకు భరోసా కల్పిద్దాం

కోరుట్లటౌన్: మహిళలకు భరోసా కల్పించడమే లక్ష్యంగా పని చేయాలని సఖీ కోఆర్డినేటర్ మనీల, ఎస్టీవో లావణ్య పేర్కొన్నారు. పట్టణంలోని టీచర్స్ క్లబ్ హాలులో స్ఫూర్తి మహిళా ఉపాధ్యాయుల సమాఖ్య ఆధ్వర్యంలో ముందస్తు అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సఖీ కోఆర్డినేటర్ మనీల, ఎస్‌టీవో లావణ్య హాజరయ్యారు. వారిని శాలువాతో ఘనంగా సన్మానించి సంబరాలు జరుపుకున్నారు. స్ఫూర్తి ప్రతినిధులు జె.సురేఖ, పద్మశ్రీ, ఎం.కవిత, మంజుల, జ్యోతిలక్ష్మీ, జయలక్ష్మీ, ప్రసన్నలక్ష్మీ, సుమలత, శ్రీలలిత, భారతి భవాని, రమాదేవి, ఉమ, మాధవి, మాధవీలత, సుధ, వందన, సరస్వతి పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

పారిశుధ్యం పని చేసే మహిళా కార్మికులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ బి.తిరుపతి పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ హాలులో మున్సిపల్ ఆధ్వర్యంలో పారిశుధ్యం మహిళా కార్మికులకు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్, మెడికల్ వైద్య బృందం పాల్గొన్నారు.



పెగడపల్లి జీపీలో కేక్ కట్ చేస్తున్న అధికారులు, మహిళలు

కోరుట్లరూరల్: వెంకటాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ తోట నారాయణ, మండల వ్యవసాయ అధికారి, ప్రత్యేక అధికారి నాగమణి కేక్ కట్ చేశారు. కార్యదర్శి నరేష్, అంగన్వాడీ, ఐకేపీ, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ తిరుపతి కేక్ కట్ చేశారు. మహిళా ఉద్యోగినులను సన్మానించారు. ఏఈ లక్ష్మీ, టీపీఎస్ రమ్య తదితరులు పాల్గొన్నారు. కల్లూరు శివారులోని కేజీబీవీలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బాధ్యులు అందె శివప్రసాద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి: మహిళల స్థితిగతులు బాగుపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్, సూపరింటెండెంట్ చక్రాధర్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, మహిళా ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: 9వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కౌన్సిలర్ శ్రీరాముల సువర్ణ మాట్లాడారు. సూపర్‌వైజర్ పద్మావతి కౌన్సిలర్‌ను సన్మానించారు. అంగన్‌వాడీ టీచర్ లావణ్య, ఉమారాణి, ఆర్పీలు శ్యామల, కోల రాధ పాల్గొన్నారు.

పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మహిళ ఉద్యోగులను ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి సన్మానించారు. వివేకవర్ధిని ఉన్నత పాఠశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఇబ్రహీంపట్నం: భారతదేశం స్త్రీమూర్తికి మొదటి ప్రాధాన్యత ఇచ్చిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి బోనయ్య అన్నారు. మండల కేంద్రంలోని బాలికల జిల్లాపరిషత్ పాఠశాలలో తపస్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజ, రామకృష్ణ, విద్యాసాగర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



వెంకటాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, ఏవో

సారంగాపూర్: బీర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, అధికారులను సన్మానించారు. జెడ్పీటీసీ పాత పద్మ, ఎంపీటీసీ సభ్యురాళ్లు ఆడెపు మల్లీశ్వరి, ఎడ్ల సృజనాసుశీన్, నారపాక రమ, మండల కోఆప్షన్ సభ్యురాలు ఎండీ బీబా, ఏపీవో స్వప్న, కార్యదర్శి శిరీషను సత్కరించారు. ఎంపీపీ మసర్తి రమేశ్, ఎంపీడీవో లచ్చాలు, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, నవీన్‌రావు ఉన్నారు.

సృష్టిలో మహిళా శక్తి మహోన్నతమైందని తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య అన్నారు. సారంగాపూర్ కస్తూర్బా బాలికల గురుకుల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయినులను సన్మానించారు. కేజీబీవీ ఎస్‌వో వీణ, తపస్ జిల్లా మహిళా విభాగం కన్వీనర్ మెన్నెని నీలిమ, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, మహిపాల్ తదితరులున్నారు.



ఇబ్రహీంపట్నం హైస్కూల్‌లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు



ఆరెపెల్లిలో మహిళలకు సన్మానం



మల్యాల: మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన తపస్ నాయకులు



రాయికల్: 9వ వార్డులో కౌన్సిలర్‌ను సన్మానిస్తున్న సూపర్‌వైజర్ పద్మావతి

కొనసాగుతున్న శివరాత్రి ఉత్సవాలు



పెగడపల్లిలో మహిళల కుంకుమ పూజలు



వెల్గటూర్: ఆలయం ముందు భక్తుల సౌకర్యార్థం వేసిన చలువ పందిళ్లు

పెగడపల్లి: పెగడపల్లి, వెంగళాయిపేట శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు రెండో రోజైన గురువారం కొనసాగాయి. కుంకుమ పూజలు, స్థాపిత దేవత పూజలు, రుద్ర హోమం, తీర్థప్రసాద వితరణ తదితర ప్రత్యేక పూజలు గుండి శ్రీనివాస్ శర్మ, రాజుశర్మ, వినయ్‌శర్మ, మధూకర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయ కమిటీ సభ్యులు, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కోటిలింగాలలో ముమ్మరంగా ఏర్పాట్లు

వెల్గటూర్: కోటిలింగాల కోటేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్, స్నాన ఘట్టాల శుభ్రం, మహిళలు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక వసతి, టాయిలెట్ సౌకర్యం, ఎండ వేడికి ఇబ్బంది పడకుండా చలువ పందిళ్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు.



ధర్మపురిలో విక్రయిస్తున్న మట్టి పాత్రలు

ధర్మపురి: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని వివిధ రకాల వస్తువులను జోరుగా విక్రయించారు. శుక్రవారం శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. శివరాత్రి రోజున జాగరణ చేసే వారందరూ మట్టితో తయారు చేసిన దీపాలు, చిప్పలను కొనుగోలు చేశారు. గోగిపూలు, కందగడ్డ, పండ్లను అమ్మారు.

వైభవోపేతంగా గీతాహవన యజ్ఞం

బుగ్గారం: మండల కేంద్రంలోని శివారు ప్రాంతంలో అందమైన ప్రకృతి సోయగాల మధ్య, పచ్చని పొలాల మధ్య కొలువై ఉన్న శ్రీసాంబశివుని నాగేశ్వరాలయంలో శివరాత్రి ఉత్సవాలలో భాగంగా గురువారం గీతాహవన యజ్ఞాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. విశ్వశాంతి, పర్యావరణ పరిరక్షణ, సర్వమానవ కల్యాణార్థం ఆదిలాబాద్ జిల్లా రోటిగూడెంకు చెందిన శ్రీహరిమౌనస్వామిజీ నేతృత్వంలో, ఆలయ చైర్మన్ మసర్తి రాజిరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని జరిపారు. 18 కుండముల వద్ద పలువురు దంపతులు ఆసీనులై సాధనాధి పవిత్రీకరణ, రక్షాసూత్రం, సర్వదేవతా పూజ, ఆజ్యాహుతి, గీతా మంత్రాహుతి, పూర్ణాహుతి తదితర ఆహుతులతో పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

శివపూజకు నోచుకోని రాయేశుని బోరు



గొల్లపల్లి: దట్నూర్‌లో పురాతనమైన బోరును గ్రామస్తులు రాయేశుని బోరుగా పిలుస్తారు. బోరుకు ఆ పేరు ఎందుకొచ్చిందనేది చాలామందికి తెలియదు. అక్కడ ఓ శివలింగం ఉండేదని, గ్రామస్తులు పూజలు చేసేవారని పాతతరం వారికే తెలుసు. ఈ క్రమంలో అక్కడ శివరాత్రి సందర్భంగా పూజలు చేసి బోరు ప్రాశస్త్యాన్ని లోకానికి చాటాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

ఆలయానికి విరాళం

వెల్గటూర్: మండల కేంద్రంలోని శ్రీరామ భక్తాంజనేయ శివలింగ దేవస్థానానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, వెల్గటూర్ మండల మాజీ జెడ్పీటీసీ దోరిశెట్టి వెంకటయ్య రూ.లక్ష విరాళం అందజేశారు. వెంకటయ్యను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ మేరుగు నరేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి గుమ్ముల సతీష్, గౌరవ అధ్యక్షుడు పెద్దూరి భరత్, నాయకులు జూపాక కుమార్, బందెల ఉదయ్, రంగు తిరుపతి, దోరిశెట్టి మల్లేశం, శాగని శ్రీనివాస్, సంకోజు సురేష్, బూసర్తి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి కార్యదర్శిగా గంగలక్ష్మణ్

సాక్షి స్పందన

ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్యదర్శి లేక పరేషాన్ అనే శీర్షికన ఈనెల 5న సాక్షిలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఇబ్రహీంపట్నం మేజర్ గ్రామ పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా మూలరాంపూర్ కార్యదర్శి గంగలక్ష్మణ్‌కు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి బాధ్యతలను అప్పగించారు. గంగలక్ష్మణ్ గురువారం బాధ్యతలు చేపట్టారు.

పరీక్ష సామగ్రి అందజేత

కోరుట్ల: పట్టణంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న 135 మంది విద్యార్థులకు కోరుట్ల న్యాయవాద దంపతులు సుతారి శ్రీనివాస్–స్రవంతి పరీక్ష సామగ్రి అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గడెల భూపతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివి న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న సుతారి శ్రీనివాస్–స్రవంతి దంపతులు సామాజిక సేవ చేయాలన్న లక్ష్యంతో విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, రబ్బర్లు అందించి తమ ఉదారత చాటుకున్నారన్నారు. సుతారి శ్రీనివాస్–స్రవంతి దంపతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వసతులు కల్పించి చక్కని విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకుంటోందన్నారు.

సంక్షిప్త వార్తలు

ఇన్‌స్పైర్ మానక్‌లో విద్యార్థుల ప్రతిభ

కథలాపూర్: 2023–24 సంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డుకు జిల్లాలోని ఆయా పాఠశాలల నుంచి ప్రాజెక్టులు తయారు చేయగా.. కథలాపూర్ మోడల్ హైస్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు గుర్తింపు పొందాయని ఉపాధ్యాయులు గురువారం తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న బూస సహస్ర, ఎలేటి పార్వతి చేసిన ప్రాజెక్టులు జిల్లాస్థాయిలో గుర్తింపు పొందాయి. వీరికి రూ.10వేల చొప్పున అందించారు. కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్‌ఎం ఆకుల రంజిత్ అభినందించారు.

బ్లాక్ బెల్ట్ సాధించిన కరాటే మాస్టర్

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ ప్రశాంస పత్రాల ప్రదానోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నంకు చెందిన కరాటే మాస్టర్ ప్రవీణ్‌కు జపాన్ 3వ డాన్ బెల్ట్‌ను కరాటే అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత నటుడు సుమన్, రాపోలు సుదర్శన్ చేతుల మీదుగా అందజేశారు.

కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లిరూరల్: పెద్దాపూర్ మల్లన్న స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపెల్లి నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులుగా రమేశ్, మల్లేశం, శ్రీనివాస్, ధర్మకర్తలుగా సురేశ్, స్వామి, నర్సయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులను పలువురు సన్మానించారు.

ఎరువుల గోదాం నిర్మాణానికి భూమిపూజ

కథలాపూర్: అంబారిపేటలో ఎరువుల నిల్వ గోదాం నిర్మాణానికి మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గురువారం భూమిపూజ చేశారు. గ్రామ రైతుల పంటల సాగుకు ఓ సీజన్‌కు సరిపడేలా ఎరువులు నిల్వ ఉంచేందుకు రూ.10లక్షలతో గోదాం నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ వేముల గంగరాజం, మాజీ సర్పంచ్ గోపు శ్రీనివాస్, విద్యాసాగర్‌రావు, ప్రకాశ్ పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

కథలాపూర్: సిరికొండ గ్రామానికి చెందిన ముదాం మనోజ్‌కుమార్ అనే యువకుడు తన పుట్టినరోజు సందర్భంగా జెడ్పీ హైస్కూల్‌కు గురువారం వంట సామగ్రి అందజేశారు. పుట్టినరోజు సందర్భంగా రూ.11వేల విలువైన వంట సామగ్రి కొనుగోలు చేసి ఉపాధ్యాయులకు అందించినట్లు ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఎం లోకిని శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రద్దు చేయాలి

జగిత్యాల: మున్సిపాలిటిలో లేఅవుట్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు రద్దు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు నిర్ణయానికి వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలి

జగిత్యాల: రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ప్రతిచోట నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలని, రాత్రివేళల్లో వ్యాపారాలు కొనసాగించేందుకు అనుమతి ఇవ్వాలన్నారు. తినుబండారాల రుచులు, పరిశుభ్రతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ దివాకర, డీఎస్పీ రఘుచందర్, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, దేవరాజు, సాయిబాబా పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు

జగిత్యాలరూరల్: జిల్లాలోని హోటళ్లలో పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. 36 సిలిండర్లను గుర్తించి 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు జిల్లా శాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

20 అంశాలు ఆమోదం

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో గురువారం కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి కమిషనర్‌తోపాటు వైస్ చైర్మన్, కౌన్సిలర్లు హాజరయ్యారు. సమావేశంలో మొత్తం 20 అంశాలను ప్రవేశపెట్టగా.. వాటిని ఆమోదించారు. రానున్న లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా చేపట్టే పనులను సమావేశంలో ఆమోదించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

కొండగట్టు: కొడిమ్యాల మండలానికి చెందిన 59మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను, విద్యుత్ ప్రమాదంలో మృతిచెందిన గొర్రెల నష్ట పరిహారం రూ.16వేల చెక్కులను కొడిమ్యాల ఎంపీడీవో కార్యాలయంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం అందజేశారు.

మల్యాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో 36మందికి కల్యాణలక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాలో నిర్లక్ష్యమెందుకు..?


- కథలాపూర్ మండల సభలో ప్రజాప్రతినిధుల ఆగ్రహం

కథలాపూర్: వేసవి కాలం ఇప్పుడే ప్రారంభమైంది.. గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో నిర్లక్ష్యమెందుకు చేస్తున్నారని పలువురు ఎంపీటీసీలు మండల సభలో సంబంధిత అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం కథలాపూర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ జవ్వాజి రేవతి అధ్యక్షతన జరిగింది. మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి ట్యాంకుల్లోకి రోజుల తరబడి నీళ్లు రాకున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని, ప్రజల ఇబ్బందులు అధికారులకు పట్టవా అంటూ వైస్ ఎంపీపీ కిరణ్‌రావు ప్రశ్నించారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ సమావేశానికి రాకపోవడంతో ఇతర సిబ్బంది ఇచ్చిన సమాధానం తీరుపై ఎంపీటీసీలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు నిర్వహిస్తే ఎంపీటీసీలకు సమాచారం ఇవ్వడం లేదని ఎంపీటీసీ బాలు సభలో ప్రస్తావించగా.. ఇకనుంచి సమాచారం ఇస్తామని ఏపీవో రాజేందర్ పేర్కొన్నారు. పలువురు అధికారులు మండల సభకు గంట ఆలస్యంగా రావడంపై ఎంపీపీ రేవతి ఇదేమిటని ప్రశ్నించగా.. ఇకనుంచి ఆలస్యంగా రాకుండా చూస్తామని ఎంపీడీవో శంకర్ సర్దిచెప్పారు. కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకున్న అధికారులు ఎప్పుడు మంజూరు చేస్తారని వైస్ ఎంపీపీ కిరణ్‌రావు, ఎంపీటీసీ బాలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. వర్షాలకు తెగిన చెరువుల మరమ్మతులు చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కోరగా.. ప్రతిపాదనలు పంపించామని, నిధులు రాగానే మరమ్మతులు చేస్తామని నీటిపారుదల శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. ఎంపీడీవో శంకర్, ఎంపీటీసీలు గంగం దేవేంద్ర, జిల్లా లక్ష్మి, ఎంఈవో ఆనందరావు, వైద్యాధికారులు సింధూజ, రచన, ఏపీఎం శంకర్, ఏఈలు జమీల్‌పాషా, భూమేశ్వర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



నీటి సమస్యపై ఏఈ చంద్రశేఖర్‌తో చర్చిస్తున్న ఎంపీపీ రేవతి, ఎంపీడీవో శంకర్


పాత సర్వే ప్రకారమే చేపట్టాలి



జగిత్యాలరూరల్: ఎస్‌హెచ్ బైపాస్ రోడ్‌ను పాత అలైన్‌మెంట్ ప్రకారమే నిర్మాణం చేపట్టాలని రైతులు గురువారం తిప్పన్నపేటలో జగిత్యాల–ధర్మపురి రహదారిపై ఆందోళన చేపట్టారు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట రైతులు మాట్లాడుతూ.. దారి మళ్లిస్తే సహించేది లేదన్నారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, అర్బన్ తహసీల్దార్ వర్దన్ రైతులతో మాట్లాడి శాంతింపజేశారు.కొంతమంది పాత అలైన్‌మెంట్ ప్రకారం నిర్మాణం చేపట్టాలని ఆందోళన చేస్తుండగా మరికొంత మంది కొత్త అలైన్‌మెంట్ ప్రకారం చేపట్టాలని ఆందోళన చేస్తున్నారు. బైపాస్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇచ్చి ఆదుకుంటామని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ అన్నారు. కండ్లపల్లి, హన్మాజీపేట శివారులో హద్దులు ఏర్పాటు చేసేందుకు వెళ్లగా రైతులు అడ్డుకున్నారు. ఆర్డీవో కండ్లపల్లికి చేరుకుని రైతులతో మాట్లాడారు. ఏదైనా అభ్యంతరాలుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని, పనులను అడ్డుకోవద్దని సూచించారు.

అర్హులకు పథకాలు అందించాలి

జగిత్యాలరూరల్: అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. 200 యూనిట్ల జీరో బిల్లు రాని లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి డాటా ఎంట్రీని పరిశీలించారు. అర్హత ఉన్నవారిని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. కార్యక్రమంలో డీపీవో దేవరాజ్, ఎంపీడీవో రమాదేవి, పర్యవేక్షకులు గంగాధర్ పాల్గొన్నారు.



సేవ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దివాకర

అన్నప్రాసన

మల్యాల: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పిల్లలకు సామూహిక అన్నప్రాసన నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం అందుతుందని, ఆటపాటలతో విద్యాబోధన చేపడుతున్నామని అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. తల్లిదండ్రులు పాల్గొన్నారు.